సాక్షి ప్రకాశం

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



కనిగిరి క్రైం స్టోరీస్

కనిగిరి ప్రాంతంలో నేరాలు పెరిగిపోయాయి. గడిచిన ఐదు నెలల్లో నాలుగు హత్యలు జరిగాయి. అవి కూడా సంచలనాలుగా మారి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. - 8లో..



ఒకటి కాదు.. మూడు సార్లు

దర్శిలోని ఒకే దుకాణంలో మూడు సార్లు చోరీ జరిగింది. బుధవారం రాత్రి మూడోసారి జరిగిన చోరీలో రూ.4 లక్షల విలువైన సరుకు అపహరణకు గురైంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/27.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏకేయూ తొలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏర్పాటు

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం తొలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను ప్రభుత్వ హయ్యర్ ఎడ్యుకేషన్ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు గురువారం ప్రకటించారు. ఈ కమిటీలో మొత్తం 9 మంది సభ్యులున్నారు. యూనివర్సిటీ కాలేజీల నుంచి సీనియర్ ప్రొఫెసర్ కేటగిరీ నుంచి డాక్టర్ జి.రాజమోహన్‌రావు (ఏకేయూ హిస్టరీ ప్రొఫెసర్), ప్రిన్సిపాల్ కేటగిరీ నుంచి డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి (ఏకేయూ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రిన్సిపాల్/డీన్ అకడమిక్స్), యూనివర్సిటీ గుర్తింపు పొందిన కాలేజీల నుంచి ప్రిన్సిపాల్ విభాగం నుంచి డాక్టర్ డి.కళ్యాణి (ఒంగోలు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్), యూనివర్సిటీ కాలేజీల నుంచి ఉపాధ్యాయుడి విభాగం నుంచి డాక్టర్ కేవీఎన్ రాజు (ఏకేయూ ఓఎస్‌డీ, హిస్టరీ డిపార్టుమెంట్), గుర్తింపు పొందిన కాలేజీల నుంచి ఉపాధ్యాయుడు కేటగిరీ నుంచి డాక్టర్ కేవీ పద్మావతి (కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కెమిస్ట్రీ లెక్చరర్) ఎంపికయ్యారు. వీరితో పాటు వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన నలుగురిని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. వారిలో కె.వెంకటేశ్వరరెడ్డి (కవి), డాక్టర్ కె.అనీలకుమారి (మదర్ థెరిస్సా ఒంటరి మహిళా సొసైటీ అధ్యక్షురాలు), నరాల ఈశ్వరరెడ్డి (శ్రీకాశీ విశ్వనాథ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్), టి.సుమతి (రిటైర్డ్ పోస్టుమాస్టర్, సామాజిక కార్యకర్త) ఉన్నారు. ఈ కౌన్సిల్ పదవీకాలం మూడు సంవత్సరాలు కాగా, ఏకేయూ మొట్టమొదటి కౌన్సిల్ కావడంతో సభ్యులను పలువురు అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన డీఐఈఓ



ఇనకొల్లు శ్రీనివాసరావు, సుబ్బారావును సన్మానిస్తున్న పలు సంఘాల నేతలు

ఒంగోలు సెంట్రల్: జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ)గా చీమకుర్తి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఇనకొల్లు శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలు నిర్వహించిన దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు వారిద్దరినీ సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు టి.వెంకటేశ్వరరెడ్డి, కె.విశ్వనాథ్, గారపాటి గోపీచంద్, ప్రకాశ్, వెంకటరావు, చక్రపాణి, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నాయకులు కేవీ రంగనాయకులు, నారాయణరావు, లైబ్రేరియన్స్ అసోసియేషన్ బాధ్యులు హనుమంతరావు, కాంట్రాక్టు అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, కుమ్మరకుంట సురేష్, పాలపర్తి మాధవరావు, బొప్పరాజు కాశీరత్నం, బాబూరావు, హజరత్తయ్య, శ్రీనివాసరావు, సుమలత, చిన్న మాధవరావు సన్మానించి సుబ్బారావు సేవలను కొనియాడారు. నూతన డీఐఈఓ శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో మండల స్థాయి స్పందన

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో ప్రత్యేక స్పందన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు మండలానికి సంబంధించిన స్పందన కార్యక్రమాన్ని స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన భవనంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒంగోలు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 13వ తేదీ గిద్దలూరులో, 15న మార్కాపురం, 20న కనిగిరి, 22న దర్శి, 27న యర్రగొండపాలెం, 29న నాగులుప్పలపాడు మండలాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో స్పందన నిర్వహించనున్నట్లు ప్రకటనలో వెల్లడించారు.



ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నికృష్ణులు



సంతపేట సాయిబాబా ఆలయం వద్ద ఉట్టి కొట్టే వేడుక





దర్శి మండలం చలివేంద్ర గ్రామం వెంకటాచలం క్షేత్రంలో ఉట్టి కొడుతున్న దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

గోపాల.. గోపాల

జిల్లాలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గోపికలు, చిన్నికృష్ణుల వేషధారణలో బాలబాలికలు అలరించారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. కృష్ణ మందిరాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణుడి నామస్మరణ మార్మోగింది. - సాక్షి, ఒంగోలు

రోడ్లకు కొత్తరూపు..!

రహదారులపై అవస్థల ప్రయాణానికి తెరపడనుంది. పశ్చిమ ప్రకాశంలో పలు రోడ్లు కొత్తరూపు సంతరించుకోనున్నాయి. దాదాపు రూ.70 కోట్లతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పీఎంఎస్‌వై పథకం కింద చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపారు. అలాగే బీటీ రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఇక జర్నీ సాఫీగా సాగనుంది.

- పశ్చిమాన రహదారులకు మహర్దశ
- రూ.18.89 కోట్లతో రోడ్ల నిర్మాణం
- రూ.32.63 కోట్లతో పలు రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు
- రూ.18.47 కోట్లతో బీటీ రోడ్ల అభివృద్ధి

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని రోడ్లకు మహర్దశ పట్టింది. ఇప్పటికే పలు రోడ్లను పూర్తిచేయగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. 3 నియోజకవర్గాల్లో రూ.18.89 కోట్లతో పీఎంఎస్‌వై పథకం కింద రోడ్ల నిర్మాణం పూర్తయింది. మార్కాపురం నియోజకవర్గంలో రూ.6.77 కోట్లతో కొనకనమిట్ల నుంచి వయా కాట్రగుంట మీదుగా నాగంపల్లి వరకూ 13 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం, తర్లుపాడు మండలంలోని గోరుగుంతలపాడు వయా సూరేపల్లి మీదుగా చెన్నారెడ్డిపల్లి వరకూ రూ.7.19 కోట్లతో పది కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో బేస్తవారిపేట నుంచి చట్టిచర్ల, పూసలపాడు వరకూ రూ.4.83 కోట్లతో 7 కిలోమీటర్ల రోడ్డును, సత్యవోలు నుంచి రాచర్ల వయా కాల్వపల్లి మీదుగా రూ.4.20 కోట్లతో 6 కిలోమీటర్ల తారు రోడ్డును పూర్తి చేశారు.



యర్రగొండపాలెం మండలంలో నిర్మించిన అమానిగుడిపాడు - గుర్రపుశాల రోడ్డు

వివిధ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు...

మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని వివిధ మండలాలు, గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అందులో ప్రధానంగా మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలం ఉన్నగురవాయపాలెం వయా వెలిగండ్ల నుంచి ఈగలపాడు వరకూ రూ.5.10 కోట్లతో 8.12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. దీంతోపాటు యర్రగొండపాలెం నియోజకవర్గంలోని త్రిపురాంతకం మండలం ఆర్‌అండ్‌బీ రోడ్డును పాత ముడివేముల వరకూ రూ.3.72 కోట్లతో 5.9 కిలోమీటర్లు, గంజివారిపల్లి - గుర్రపుశాల వరకూ వయా కొలుకుల చెన్నరాయునిపల్లి మీదుగా రూ.5.34 కోట్లతో 11.4 కిలోమీటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపారు.

బీటీ రోడ్లకు మరమ్మతులు...

మూడు నియోజకవర్గాల్లోని బీటీ రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో 7 వర్కులకు 3.94 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. ఇందులో ప్రధానంగా శంకరాపురం - పెద్ద కందుకూరు 17.08 కిలోమీటర్ల పొడవున పూర్తిగా తారురోడ్డు మరమ్మతులు, ఒంగోలు నుంచి నంద్యాల రోడ్డులో పి.మల్లాపురం వరకూ రోడ్ల మరమ్మతులు చేపట్టారు. వీటిలో కొన్ని పూర్తయ్యాయి. మార్కాపురం నియోజకవర్గంలో 15 వర్కులకుగానూ 7.53 కోట్ల రూపాయలతో బీటీ రోడ్ల మరమ్మతులు పూర్తయ్యాయి. ఇందులో చింతగుంట్ల- ఎల్‌బీఎస్ నగర్, వేములకోట రోడ్డు, తర్లుపాడు-కలుజువ్వలపాడు ప్రధానంగా ఉన్నాయి. యర్రగొండపాలెంలో 11 వర్కులకు రూ.7 కోట్లు అవసరం అవుతాయని ప్రతిపాదనలు పంపారు. అమానిగుడిపాడు, గుర్రపుశాల, మాచర్ల - శ్రీశైలం రోడ్డు, ముటుకుల - గుట్లపల్లి రోడ్డు ఉన్నాయి. అలాగే కె.గోళ్లవిడిపి - త్రిపురాంతకం రోడ్లు ఉన్నాయి.



తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లి - తుమ్మలచెరువు రోడ్డు



వేములకోట బీటీ రోడ్డు

రోడ్ల అభివృద్ధికి నిధులు

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో పీఎంఎస్‌వై పథకం కింద రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పలు మండలాల్లో రోడ్ల అభివృద్ధికి, బీటీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపాం. ఇంపాక్ట్ రోడ్ల మరమ్మతులకు మూడు నియోజకవర్గాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపాం.

\- రమేష్‌బాబు, ఈఈ పంచాయతీరాజ్, మార్కాపురం

ఓటుకు ఆధార్ అనుసంధానాన్ని పూర్తి చేయాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటుకు ఆధార్ అనుసంధానాన్ని నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఎన్నికల విభాగం అధికారులతో స్పెషల్ సమ్మరి రివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ అనుసంధానంపై తహసీల్దార్లు, క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితా ఒకసారి పరిశీలించిన తర్వాత ఎటువంటి పొరపాట్లు ఉండకూడదన్నారు. ఇంటింటి సర్వే చేసి మరణించిన వారి ఓట్లను ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని డిలిషన్ చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ పనిచేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీఓలు విశ్వేశ్వరరావు, అజయ్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు పాల్గొన్నారు. కలెక్టర్ సమావేశం అనంతరం స్పందన భవనంలో రాజకీయ పార్టీలు, బీఎల్‌ఓలతో ఆర్‌డీఓ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా ప్రభుత్వం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

- ఏళ్ల తరబడి పరిష్కారం కాని వాటి నుంచి విముక్తి
- ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి
- జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం

ఒంగోలు సబర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవమైన ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా ఎండ్లూరి చిట్టిబాబుతో పాటు పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా కాకర్ల వెంకటరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కొనియాడారు. తొలుత తీసుకున్న కేబినెట్ నిర్ణయంలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని మాత్రమే రెగ్యులర్ చేయాల్సి ఉందన్నారు. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు ఆ నిబంధనను సవరిస్తూ ఇప్పటి వరకు పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని పునఃసమీక్షించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నిర్ణయం న్యాయ విభాగానికి వెళ్లి గజిట్ అయి ప్రస్తుతం గవర్నర్ సంతకం దశలో ఉందన్నారు. అక్కడ నుంచి వచ్చిన తర్వాత తిరిగి కేబినెట్ మళ్లీ తీర్మానం చేసి జీఓ విడుదల చేస్తుందన్నారు. అది కూడా త్వరలోనే పూర్తవుతుందన్నారు. డీఏ బకాయిలు, ఉద్యోగుల సరెండర్ బిల్స్ బకాయిలన్నింటినీ సెప్టెంబర్ ఆఖరుకు పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. 1993కు ముందు నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు, ఎన్‌ఎంఆర్, పార్ట్ టైం, కంటింజెంట్ ఉద్యోగులను కూడా రెగ్యులరైజ్ చేయాలని సీఎంను కోరామన్నారు. మొత్తం 4 వేల మంది మాత్రమే ఉన్నారని, వాళ్లందరినీ రెగ్యులరైజ్ చేయడం వలన ప్రభుత్వంపై ఏడాదికి కేవలం రూ.16.67 కోట్లు మాత్రమే భారం పడుతుందని తెలిపారు. 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా కాంట్రాక్టు విధానంలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరామని గుర్తు చేశారు. దశాబ్దాల తరబడి పరిష్కారం కాని ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు పోతున్నారన్నారు. ముఖ్యమంత్రి ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి దసరాకు డీఏ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా పీఆర్‌సీ కమిటీని నియమించారని, త్వరలోనే ప్రభుత్వానికి ఆ కమిటీ నివేదిక ఇచ్చి ఉద్యోగుల ఆశలు నెరవేరుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ఫెడరేషన్ ముందుండి పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరవపాల్, కోశాధికారి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీ...

ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎండ్లూరి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆవుల రాధాకృష్ణ, కన్వీనర్‌గా భవనం వెంకట్రామిరెడ్డి, ట్రెజరర్‌గా కొలకలూరి ప్రభాకర్‌రావు, కో చైర్మన్‌గా ఎస్‌కే జమీ ముల్లా, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో పాటు పూర్తి స్థాయి కమిటీని ప్రకటించారు.

సౌత్ ఇండియా కరాటే పోటీలకు 14 మంది ఎంపిక

ఒంగోలు: సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి 14 మంది ఎంపికైనట్లు శ్రీప్రతిభ విద్యాసంస్థల సీఈవో నల్లూరి జయప్రకాష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు స్థానిక శ్రీప్రతిభ కాలేజీలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఆవశ్యకతను నేటి ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. ఆరోగ్యంపై కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్న తరుణంలో శిక్షణ కార్యక్రమాలు మరింత విస్తృతం కావాలన్నారు. స్పోర్ట్స్ కరాటే డో ఏపీ ప్రధాన కార్యదర్శి, స్పోర్ట్స్ కరాటే డో ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లూరి మోహన్‌రావు మాట్లాడుతూ ఈ నెల 5, 6 తేదీల్లో విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో మన జిల్లా విద్యార్థులు సత్తాచాటారన్నారు. ఈ పోటీల్లో గోపిక, వేద అఖిల్, భవేష్‌వర్మ, వై.పవన్ కళ్యాణ్‌రెడ్డి, పి.లక్ష్మీసాగర్, పి.దేవానంద్, కె.యశ్వంత్, బి.గీతాసాయి విక్రమ్‌తోపాటు మార్కాపురం నుంచి ఆరుగురు విద్యార్థులు దక్షిణ భారత స్థాయి చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు వివరించారు. ఈ పోటీలు ఈ నెల 9, 10 తేదీల్లో కేరళలోని తిరువనంతపురంలో జరుగుతాయన్నారు. ఎంపికైన విద్యార్థులను కాలేజీ కార్యదర్శి నల్లూరి జయప్రకాష్‌తో పాటు స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు జి.రాఘవ, సిద్దార్థ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు తదితరులు అభినందించి కరాటే స్పోర్ట్స్ కిట్లను బహూకరించారు.



ఎంపికైన విద్యార్థులకు కరాటే స్పోర్ట్స్ కిట్లు బహూకరిస్తున్న జయప్రకాష్

క్లుప్తంగా

మెడికల్ షాపుల్లో సోదాలు



సోదాలు నిర్వహిస్తున్న అధికారులు

హనుమంతునిపాడు: మండలంలోని మెడికల్ షాపులపై గురువారం డ్రగ్ నియంత్రణ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. మండల పరిధిలోని వేములపాడులో వెంకటేశ్వర మెడికల్, ఫ్యాన్సీ దుకాణంలో సోదాలు నిర్వహించి గడువు ముగిసిన మెడిసన్స్, డాక్టర్ శాంపిల్ మెడిసిన్, నాసిరకం మందులను స్వాధీనం చేసుకున్నారు. యజమాని నారాయణపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. సోదాల్లో అసిస్టెంట్ డైరెక్టర్ బీఎస్ జ్యోతి, డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు బి.సంధ్య, వెంకట కృష్ణలు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



అనుమానాస్పదంగా మృతిచెందిన వ్యక్తి

దర్శి: మండలంలోని చందలూరు సమీపంలో వాగు వద్ద గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. వాగు వద్ద అనుమానాస్పద స్థితిలో ఉన్న వ్యక్తిని గమనించి 108 కి సమాచారం అందించటంతో 108 సిబ్బంది ఆ వ్యక్తిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వ్యక్తి మృతిచెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనిగిరి క్రైమ్ స్టోరీస్!

- సంచలన హత్యలతో తరచూ వార్తల్లో నిలుస్తున్న కనిగిరి ప్రాంతం
- గడిచిన ఐదు నెలల్లో 4 హత్యలు
- అన్నీ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపించే ఘటనలే..

ఒంగోలు టౌన్: నాలుగు హత్యలు.. అన్నీ సంచలనాలే.. క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను తలపించే ఈ ఘాతుకాలన్నీ పశ్చిమ ప్రకాశం లోని కనిగిరి నియోజకవర్గంలోనే చోటుచేసుకోవడం గమనార్హం. సంచలనం సృష్టించిన వరుస హత్యలతో కనిగిరి పేరు తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఆస్తి కోసం ఒకరు, కట్టుకున్న భార్య మీద అనుమానంతో మరొకరు, భార్య మీద కోపంతో ఇంకొకరు, కామంతో కళ్లు మూసుకుపోయి ఇంకొకడు హత్యలకు పాల్పడి హడలెత్తించారు. అయినవారే కాలయములై లేశమంతైనా కనికరం లేకుండా దారుణాలకు ఒడిగట్టిన తీరు చూసి జిల్లా వాసులే కాదు రాష్ట్రమంతా విస్తుపోయింది! మొత్తం మీద కనిగిరి సబ్ డివిజన్ పరిధిలో జరిగిన హత్యలు మానవత్వానికే మచ్చ తెచ్చాయి. మానవ సంబంధాలపై నమ్మకాలను పోగొట్టేలా ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



భర్త చేతిలో దారుణ హత్యకు గురైన కోటా రాధ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)



కనిగిరిలో అన్న చేతిలో హత్యకు గురైన సుశీల మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై(ఫైల్)



చింతపాలెంలో సాత్విక్ షాలోన్ ఇంటి వద్ద పోలీసు జాగిలంతో తనిఖీ(ఫైల్)

ఆస్తి కోసం ఓ అన్న ఘాతుకం



సుశీల(ఫైల్)

అన్న అంటే చెల్లెలికి రక్షణ కల్పించేవాడని మన సమాజం నమ్ముతుంది. కనిగిరి కొత్తపేటకు చెందిన కొలిపర్తి శ్రీనివాసులు మాత్రం అది తప్పని నిరూపించాడు.! కాసుల కోసం తోబుట్టువును పొట్టన పెట్టుకున్నాడు. కొలిపర్తి శ్రీనివాసులు, ఓలేటి సుశీల అన్నా చెల్లెల్లు. భర్తతో మనస్పర్థలు వచ్చిన సుశీల అతడికి విడాకులు ఇచ్చేసి తల్లి దగ్గరకు చేరింది. తల్లి పేరు మీద ఉన్న ఆస్తిని తన పేరు మీద వీలునామా రాయించుకుంది. అదే చివరికి ఆమె ప్రాణాలు తీస్తుందని ఊహించలేకపోయింది. వ్యాపారాలు చేసి అప్పులపాలైన శ్రీనివాసులు తల్లి ఆస్తి మీద కన్నేశాడు. ఆస్తిని తెగనమ్మేందుకు చెల్లెలు సుశీల అంగీకరించడం లేదు. దాంతో ఆమెను అడ్డుతొలగించుకోవాలని ప్లాన్ చేశారు. తనకు సన్నిహితంగా మసలే ఒక మహిళ ద్వారా విజయవాడకు చెందిన కిరాయి హంతకులకు సుపారీ ఇచ్చాడు. 2023 ఏప్రిల్ 4వ తేదీన అత్యంత దారుణంగా చెల్లెలిని హత్య చేయించాడు.

కామాంధుడి చేతిలో బాలుడు బలి



సాత్విక్ షాలోన్(ఫైల్)

అన్నెంపున్నెం ఎరుగని పసికందును కామంతో కళ్లు మూసుకుపోయిన దుర్మార్గుడు హత్య చేసిన ఉదంతమిది. సీఎస్‌పురం మండలంలోని చింతల పాలెం ఎస్సీ కాలనీకి చెందిన మైలారి కెజియా, శామ్యూల్ భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు.. పేరు సాత్విక్ షాలోన్.. వయసు పదహారు నెలలు. అదే గ్రామానికి చెందిన మైలారి అమర్ అనే 19 ఏళ్ల యువకుడు మొబైల్ ఫోన్లలో అశ్లీల చిత్రాలు చూడడానికి అలవాటు పడ్డాడు. కోరికలతో దహించుకుపోయిన ఆ యువకుడి కన్ను కెజియాపై పడింది. అందు కోసం ఆమె కుమారుడు సాత్విక్‌ను అడ్డుతొలగించుకోవాలని భావించాడు. అర్ధరాత్రి నానమ్మ పక్కలో పడుకుని ఉన్న సాత్విక్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. నోరు మూసి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. ఆ తరువాత గ్రామ శివారులోని పొలంలో బాలుడి మృతదేహంపై సజ్జల పొట్టు కప్పి వచ్చాడు. పసివాడి హత్య పలువురిని కంటతడి పెట్టించింది.

అనుమానం పెనుభూతం



కోటా రాధ(ఫైల్)

మేడం రాధ ఉరఫ్ కోటా రాధ హత్య ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచనలం సృష్టించింది. వెలిగండ్ల మండలం జిల్లెలపాడు గ్రామానికి చెందిన రాధకు తెలంగాణలోని కోదాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు కలిగారు. హాయిగా సాగుతున్న కాపురంలో రాధ బాల్యస్నేహితుడు కేతిరెడ్డి కాశిరెడ్డి ప్రవేశించాడు. స్నేహంగా మసలుతూ ఆ దంపతుల వద్ద 50 లక్షల రుపాయలు అప్పు తీసుకున్నాడు. సకాలంలో చెల్లించకపోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఆ గొడవ కాస్త అనుమానాల వరకు వెళ్లింది. తన భార్య కాశిరెడ్డితో సన్నిహితంగా ఉంటోందని అనుమానం పెంచుకున్న మోహన్‌రెడ్డి పక్కా ప్లాన్ ప్రకారం 2023 మే 17న భార్యను హతమార్చాడు. కారుతో తొక్కించి, బండరాళ్లతో బాది చంపడం సంచలనం సృష్టించింది. క్రైం సినిమాను తలపించిన ఈ హత్య కనిగిరి ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది.

కన్నతండ్రే కాలయముడు



మంజుల(ఫైల్)

కనిగిరి మండలం గొల్లపల్లి గ్రామ శివారు వద్ద 2023 ఆగస్టు 21వ తేదీన జరిగిన పదమూడేళ్ల బాలిక హత్య కలకలం సృష్టించింది. వెంకట నరసమ్మ, బుచ్చిరాజు వెంకటేశ్వర్లు ఇద్దరూ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి సంతానం. వెంకటేశ్వర్లు తరచూ మద్యం సేవించి భార్యను అనుమానిస్తూ వేధించేవాడు. దాంతో విసుగు చెందిన నరసమ్మ పిల్లలను తీసుకుని వెలిగండ్ల మండలంలోని పద్మాపురం గ్రామంలో తల్లి వద్దకు వెళ్లిపోయింది. భార్య విడిచి వెళ్లిపోవడాన్ని జీర్ణించుకోలేని వెంకటేశ్వర్లు కనిగిరి జిల్లా పరిషత్ హైస్కూల్లో 7వ తరగతి చదువుకుంటున్న చిన్న కూతురు మంజులను హత మార్చేందుకు కుట్ర పన్నాడు. స్కూలు దగ్గరకు వెళ్లి మాయమాటలు చెప్పి నమ్మించి కూతురిని వెంట తీసుకెళ్లిన వెంకటేశ్వర్లు పద్మాపురం గ్రామ శివారులో బండరాళ్లతో మోది పాశవికంగా హత్య చేశాడు.

మాజీ ఎమ్మెల్యే 'ఉడుముల'కు మాతృవియోగం



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె



ఆదిలక్ష్మమ్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి మాతృమూర్తి ఉడుముల ఆదిలక్ష్మమ్మ(92) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదిలక్ష్మమ్మ దివంగత మాజీ ఎమ్మెల్యే ఉడుముల వెంకటరెడ్డి సతీమణి. ఆదిలక్ష్మమ్మకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదిలక్ష్మమ్మ భర్త వెంకటరెడ్డి 1985లో కంభం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన మూడవ కుమారుడైన ఉడుముల శ్రీనివాసులరెడ్డి 2004లో కంభం ఎమ్మెల్యేగా పనిచేశారు. నాలుగో కుమారుడైన ఉడుముల రామనారాయణరెడ్డి 2014లో కొనకనమిట్ల మండల ఎంపీపీగా పని చేశారు. ఐదో కుమారుడు ఉడుముల గురవారెడ్డి 2006లో చినారికట్ల గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. ఆమె మృతదేహాన్ని బంధువులు, వారి అభిమానుల సందర్శనార్థం చినారికట్లలో స్వగ్రామంలో ఉంచారు. ఆదిలక్ష్మమ్మ మృతదేహాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, కనిగిరి మాజీ ఎమ్మెల్యేలు ముక్కు కాశిరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డిలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆదిలక్ష్మమ్మ మృతదేహానికి నివాళులు అర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా హనుమారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసులరెడ్డి, కేవీ రమణారెడ్డి, షంషీర్ ఆలీబేగ్, పారిశ్రామికవేత్త ఉడుముల లక్ష్మీనారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి(బన్ని), రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంపల్లి బాలమురళీకృష్ణ, కొనకనమిట్ల, మర్రిపూడి, తర్లుపాడు మండల ఎంపీపీలు మోరబోయిన మురళీకృష్ణయాదవ్, వాకా వెంకటరెడ్డి, సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, కొనకనమిట్ల, తర్లుపాడు మండల జడ్పీటీసీలు అక్కిదాసరి ఏడుకొండలు, వెన్నా ఇందిర హనుమారెడ్డి, సొసైటీ చైర్మన్‌లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసులరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మెట్టు వెంకటరెడ్డి, సాయి రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు మోరా శంకర్‌రెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసులరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు. గురువారం సాయంత్రం ఆదిలక్ష్మమ్మ మృతదేహానికి బంధువులు, అభిమానుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

ఒకటి కాదు..మూడుసార్లు

- ఒకే దుకాణంలో మూడవసారి చోరీ
- రూ.4 లక్షల విలువైన సరుకులు, వస్తువులు చోరీ



రేకును వంచి దుకాణం లోపలికి దొంగలు ప్రవేశించిన ప్రాంతం



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

దర్శి: ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా మూడు సార్లు ఒకే దుకాణంలో చోరీ జరిగింది. తాజాగా బుధవారం రాత్రి జరిగిన చోరీలో దుండగలు రూ.4 లక్షల విలువైన సరుకును అపహరించుకుపోయారు. బాధితుడు దుకాణం యజమాని సాయి తెలిపిన వివరాల మేరకు.. రోజుటి లాగే షాపు మూసి వేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి షాపు ఓపెన్‌చేసి చూసేసరికి పైన రేకులు కట్ చేసి కిందకు వంచి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా రూ.1.40 లక్షల విలువైన సిగరెట్లు, బీడీలు, రూ.75 వేల విలువైన చుట్టలు, రూ.21 వేల విలువైన సబ్బులు, రూ.15 వేల నగదు, 400 గ్రాము వెండి కాయన్, ఇతర వస్తువులు మొత్తం రూ.4 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశాడు. దుండగులు సీసీ కెమెరాలు కట్ చేసి హార్డ్ డిస్క్‌లు కూడా తీసుకుపోయారు. ఎస్సై రామకృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం వేలి ముద్రలు సేకరించారు.

గతంలో రెండుసార్లు

గతంలో ఇదే షాపులో గతంతో రెండు సార్లు చోరీ జరిగాయి. మొదటి సారి రూ.1.50 లక్షల నగదు, రూ.2.85 లక్షల విలువైన సిగరెట్లు చోరీకి గురయ్యాయి. రెండోసారి రూ.50 వేల విలువైన సిగరెట్లు, సబ్బులు చోరీకి గురయ్యాయి. ఈ షాపు ఎడమ పక్క టీవీల షాపులో ఒకసారి, కుడిపక్క హోల్‌సెల్ షాపులో రెండుసార్లు వెరసి మొత్తం ఒకే చోట మూడు వరుస షాపుల్లో ఆరుసార్లు దొంగతనాలు జరిగాయి.

జగనన్న సురక్ష పక్కాగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: ప్రజలకు మరింత చేరువగా మెరుగైన వైద్య సేవలందించేందుకు చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి సంబంధిత అధికారులకు సూచించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జేఏఎస్ కార్యక్రమంలో ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించేందుకు డోర్ టు డోర్ ప్రచారం, సంప్రదింపులు, చికిత్స, రిఫరల్ కోసం ఆరోగ్య శిబిరం శిబిరం నిర్వహించడం ఉంటాయన్నారు. డోర్ టు డోర్‌లో ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పూర్తి కేస్ షీట్‌లతో పాటు ఫలితాలను వైద్యులకు చేరుస్తారన్నారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించిన రోజు వైద్యుల సంప్రదింపులు చేసి అవసరమైన మందులు ఇవ్వడం తర్వాత చికిత్స ఉంటే వారికి అవసరమైన ఉన్నత ఆరోగ్య కేంద్రాలకు సిఫార్సు చేస్తామన్నారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు సంబంధించి వారికి అవసరమైన సూచనలు చేయడం జరగుతుందన్నారు. దీనిలో భాగంగా ఆరోగ్యశ్రీ ఆరోగ్య సంరక్షణ సేవలు ఏ విధంగా పొందాలో కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

గ్రామాల్లో ఎంపీడీఓ, తహశీల్దార్, పీహెచ్‌సి మెడికల్ అధికారి, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వారీగా వారీగా హెల్త్ క్యాంపులు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, పీహెచ్‌సీల మెడికల్ అధికారులు క్యాంపుల ప్రణాళిక సిద్ధం చేస్తారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 30రోజులు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ మూర్తి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ శ్రావణ్, నోడల్ అధికారి భగీరధి, డాక్టర్ నళిని ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన జీవనోపాధి

- స్టేట్ లైవ్లీహుడ్ సెర్ప్ డైరెక్టర్ పద్మావతి



మాట్లాడుతున్న పద్మావతి

మార్కాపురం: పేద ప్రజలు, మహిళల జీవనోపాధికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని స్టేట్ లైవ్లీ హుడ్ సెర్ప్ డైరెక్టర్ పద్మావతి పేర్కొన్నారు. స్థానిక డ్వాక్రా బజారులో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని మహిళలకు చేరువ చేయాలన్నారు. మహిళలతో యూనిట్లు పెట్టించి, ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. రుణాల రికవరీపైనా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఫామ్ లైవ్లీహుడ్ మేనేజర్ శ్రీనివాస్, డీఆర్‌డీఏ డీపీ రవికుమార్, డీపీఎం డేవిడ్, ఏపీఎం బాలసుబ్రహ్మణ్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం




లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: సమస్యల పరిష్కారానికే మీ గడప ముందుకు వస్తున్నామని, ప్రతి ఒక్కరి సమస్యలను శ్రద్ధగా విని పరిష్కార మార్గం చూపుతూ ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం మార్కాపురం మున్సిపాలిటీ 6వ సచివాలయం పరిధిలోని 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఏలూరి జ్యోతి రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కేపీ వార్డులో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవరత్నాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని పేర్కొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి కాలనీ ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మున్సిపల్ డీఈ సుభాని, కౌన్సిలర్లు సిరాజ్, దొడ్డా భాగ్యలక్ష్మి, కొత్త కృష్ణ, బుశెట్టి నాగేశ్వరరావు, దూదేకుల ప్రసాద్, దారివేముల హర్షిత, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, గుంటక చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు తడికమళ్ల బాలసుబ్బారావు, నాయకులు ఉత్తమ్‌కుమార్, వెంకటరెడ్డి, కె.సురేష్, ఏలూరి నరసింహారావు, సతీష్, ఉస్మాన్, కరీంబాషా, సుధీర్, డేగ శ్రీను, రహ్మతుల్లా, రంగయ్య, విజయ్, ఏఈ ఆది నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షాపు యజమానికి టోకరా..!

- యజమానిని మాటల్లో పెట్టి ఫోన్‌పేలోరూ.98 వేలు బదిలీ చేసుకున్న మోసగాడు



మోసగాడు ఫోన్‌పే లావాదేవీ

యర్రగొండపాలెం: దుస్తుల దుకాణం యజమానిని మాటల్లో పెట్టి అతని ఫోన్ పే నుంచి రూ.98 వేలను ఆగంతుడు బదిలీ చేసుకున్నాడు. ఈ ఘటన యర్రగొండపాలెంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి సమీపంలో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర దుస్తుల దుకాణంలో లుంగీలు కొనేందుకు వ్యక్తి వచ్చాడు. అక్కడ 25 లుంగీలు కొనుగోలు చేశాడు. వాటికి నగదు ఫోన్‌పే చేస్తానని చెప్పి ఫోన్‌లో ఏవో నంబర్లు నొక్కి చెల్లించినట్లు నటించాడు. దుకాణ యజమాని ఫోన్ పే ఓపెన్ చేసి చూడగా..డబ్బులు రాలేదు. ఆ సమయంలో ఫోన్‌పే యూపీఐ నంబర్‌ను ఆ వ్యక్తి పసికట్టాడు. డబ్బులు జమైంది, లేనిది నేను చూస్తానని చెప్పి షాపు యజమాని సెల్ తీసుకొని మాటల్లో పెట్టి ఫోన్ పే నుంచి రూ.98 వేలను తన అకౌంట్‌కు జమ చేసుకున్నాడు. ఏటీఎం వద్దకు వెళ్లి డబ్బులు తీసుకొని వస్తానని చెప్పిన ఆ వ్యక్తి షాపులో నుంచి బయటికి వెళ్లిన వెంటనే డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో షాపు యజమాని పోలీసులను ఆశ్రయించాడు. మోసగాడు జమ చేసుకున్న రశీదు నిర్వి ఎంటర్‌ప్రైజెస్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అని ఉందని ఆ షాపు యజమాని కోటేశ్వరరావు తెలిపాడు. షాపులో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న వేరే కెమెరాల పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై జి.కోటయ్య తెలిపారు.